## క్లుప్తంగా

### విద్యార్థులకు ప్రోత్సాహం

తుక్కుగూడ: తుక్కుగూడ పరిధిలోని పలు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులను సాధించాలని రెడ్డి సంఘం మున్సిపల్ అధ్యక్షుడు చింతల సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పదో తరగతిలో 10(జీపీఏ)లను సాధిస్తే విద్యార్థులకు తనవంతుగా రూ.10వేలు ప్రోత్సాహక నగదును అందజేస్తానని ప్రకటించారు.

### సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులుకు కొంగు బంగారంగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణమాదిగ, ఎంఎస్సీ అధ్యక్షుడు జంగయ్యమాదిగ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లు తేల్చాకే గ్రూప్-1, 2, 3 ఫలితాలను విడుదల చేయాలని, అప్పటి వరకు నిలిపివేయాలని, లేకపోతే దళితులకు తీరని ద్రోహం చేసిన వారవుతారన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దరామయ్య, నాయకులు మంద పాండు, పి.జంగయ్యమాదిగ, ఆలేటి కృష్ణమాదిగ, తాండ్ర బాలయ్యమాదిగ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

### తుక్కుగూడకు తరలిన సీపీఐ నాయకులు

కొందుర్గు: తుక్కుగూడలో ఏర్పాటు చేసిన సీపీఐ జిల్లా స్థాయి సెమినార్‌కు మంగళవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా తుక్కుగూడలో జిల్లాస్థాయి సెమినార్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సెమినార్‌లో సీపీఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల సీపీఐ కార్యదర్శులు బాగళ్ల నర్సింహ, వెంకటేశ్, నాయకులు కృష్ణ, లింగం, భీమయ్య, బాల్‌రాజ్, శబ్బీర్, అనంత, యామిని, లక్ష్మమ్మ, యాదమ్మ, సురేశ్, జంగయ్య, సునీత, నర్సింహ పాల్గొన్నారు.

### విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు

**ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి**

కొత్తూరు: ఫీజుల నెపంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి అన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో మంగళవారం పలువురు నాయకులతో కలిసి పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతున్న పది పరీక్షల నిర్వహణకు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ముఖ్యంగా తాగునీరు, తరగతి గదుల్లో సరైన వెలుతురు ఉండే విధంగా చూడాలన్నారు. అంతేకాకుండా ఫీజులు కట్టలేదనే నెపంతో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. నాయకులు శివకుమార్‌చారి పాల్గొన్నారు.

# ఆఖరి మజిలీకి అవస్థలు!

- జల్‌పల్లి శ్రీరాంకాలనీలో చావు గోస
- శ్మశానవాటిక లేకపోవడంతో అంతిమ సంస్కారాలకు అష్టకష్టాలు
- పట్టించుకోని అధికారులు



శ్మశానవాటికకు నోచుకోని శ్రీరాంకాలనీ

మహేదీశరీఫ్: జననం.. మరణం.. ఈ మధ్యలోని కాలమే జీవితం. అలాంటి జీవిత చివరి అంకమైన మరణం సంభవించినప్పుడు అశ్రునయనాల నడుమ గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించాలని కోరుకోవడం సహజం. కానీ జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఎవరైనా చనిపోయారంటే ఎక్కడ అంత్యక్రియలు నిర్వహించాలన్న ఆందోళన మొదలవుతోంది. ఈ కాలనీలో శ్మశానవాటిక లేకపోవడమే ఈ దుస్థితికి కారణం. ఇంట్లోని కుటుంబ సభ్యుడు చనిపోయారన్న బాధ కంటే అంత్యక్రియల అంశమే వారిని ఎక్కువ మనోవేదనకు గురిచేస్తోంది. పెద్దఎత్తున ప్రభుత్వ భూములు కలిగి ఉన్నప్పటికీ పాలకులకు మాత్రం శ్మశానవాటికకు స్థలం కేటాయించడానికి మనసు రావడం స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**20వేలకు పైగా జనాభా ఉన్నా..**

గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వైకుంఠధామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ జల్‌పల్లి మున్సిపాలిటీలో మాత్రం ఆ వైపు అడుగులు పడలేదు. ఏకంగా 20 వేలకు పైగా జనాభా కలిగిన శ్రీరాం కాలనీలో శ్మశాన వాటికలు లేకపోవడంతో ప్రజలు అంత్యక్రియల నిమిత్తం వేలకు వేల రూపాయలు వెచ్చించి ఏకంగా పురానాపుల్‌కు వెళ్లాల్సి వస్తోంది. బంధుమిత్రులు, ఆప్తులు అంతదూరం వెళ్లలేక కొద్ది మందితో మాత్రమే ఆఖరి మజిలీ చేయాల్సి వస్తోంది. జల్‌పల్లి చెరువు వద్ద అంత్యక్రియలు నిర్వహించాలంటే మాత్రం పెద్దఎత్తున సిపార్సు చేసుకోవాల్సిన పరిస్థితి. పైగా చెరువు పూర్తిగా నిండిపోవడంతో ఆ అవకాశం కూడా లేకుండాపోతోంది.

**కుచించుకుపోయిన రెండు శ్మశానవాటికలు**

ఒకప్పుడు జల్‌పల్లి గ్రామానికి ఆమ్లెట్‌గా చిన్నపాటి క్వార్టర్స్‌తో మొదలైన శ్రీరాంకాలనీ ప్రస్తుతం భారీగా విస్తరించింది. 30 ఏళ్ల క్రితం ఈ కాలనీలో వడ్డెర, పద్మశాలి కులాలకు శ్మశానవాటికలను కేటాయించారు. ప్రస్తుతం ఈ రెండు శ్మశానవాటికలు పూర్తిగా కబ్జాకు గురై కొన్ని సమాధులు మాత్రమే ఆనవాళ్లుగా మిగిలిపోయాయి. ఇక్కడ అంత్యక్రియలు సైతం నిర్వహించడం లేదు. ఈ శ్మశానవాటికలకు ప్రహరీలు, వెయిటింగ్ రూమ్‌లు, నీటి సదుపాయం కూడా లేకుండా చెట్ల పొదలతో నిండిపోయాయి.

**వారి అంత్యక్రియలు ఇక్కడ.. వీరి అంత్యక్రియలు అక్కడ..**

హైదరాబాద్ మహానగర వ్యాప్తంగా ఉన్న పార్ధీ(నక్కల పిట్టలోల్లు)లలో ఎవరైనా చనిపోతే తప్పనిసరిగా వారిని జల్‌పల్లి పిట్టలగూడెంలోని శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా పురానాపుల్ పార్ధివాడ నుంచి ఇక్కడికి అంత్యక్రియలకు భారీగా విచ్చేస్తుంటారు. జల్‌పల్లి శ్రీరాంకాలనీలో చనిపోయిన వారి అంత్యక్రియలేమో పురానాపుల్ శ్మశానవాటికలో నిర్వహించాల్సి వస్తోంది. ఇలా జల్‌పల్లి శ్రీరాం కాలనీ ప్రజల అంత్యక్రియలు పురానాపుల్‌లో.. పురానాపూల్ పార్ధీల అంత్యక్రియలను జల్‌పల్లిలో చేయడం పరిపాటిగా మారింది.



ప్రహరీ లేక నివాసాలతో కుచించికుపోయిన శ్రీరాంకాలనీలోని శ్మశానవాటిక

**స్థలం కేటాయించాలి**



శ్రీరాం కాలనీలో శ్మశానవాటిక లేకపోవడంతో ఊరిలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్తులు చచ్చిబతకాల్సి వస్తోంది. అంత్యక్రియల విషయంలో ఈ పరిస్థితి ఉండడం దారుణం. పురానాపుల్‌కు తీసుకెళ్లాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. జల్‌పల్లి చెరువు పూర్తిగా నిండడంతో అక్కడ కూడా అవకాశం లేదు. జల్‌పల్లి గ్రామ పరిధిలోని ఎక్కడో ఒక చోట ప్రభుత్వ భూమిని శ్మశానవాటికకు కేటాయించాలి.

– గుండు నర్సింగ్, శ్రీరాంకాలనీ

# ఎస్టీ కమిషన్ సభ్యుడికి సన్మానం



హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: కడ్తాల్ వైపు వెళ్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను మంగళవారం కందుకూరులో బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొంది ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలంనాయక్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.భూమిరెడ్డి, నాయకులు రఘునందన్, భాస్కర్‌నాయక్, బాలునాయక్, గోపాల్‌నాయక్, రాజు, భానుప్రకాశ్, కిరణ్, వినోద్, రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం మండల తహసీల్దార్ వేణుగోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కబ్జాకు గురవుతున్న సర్వే నెం-24లోని రెవెన్యూ ప్లాట్లను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు చెందిన ఈ భూములు అక్రమంగా ఇతరుల చేతికి వెళ్లకుండా కాపాడేందుకు బోర్డులను ఏర్పా టు చేయాలన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ అర్హుడికి అందించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో శాతెల్లి నాగరాజు ఉన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కందుకూరు: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రఘు తదితరులు 75 మంది రోగులకు ఉచిత రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా రిసోర్స్ పర్సన్ రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అంటు వ్యాధి కాదన్నారు. తెలియని వారితో అక్రమ సంబంధాలతోనే ఆ వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లింకు వర్కర్ రజిత పాల్గొన్నారు.

# ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

బడంగ్‌పేట్: బాచుపల్లిలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రాడ్యుయేషన్ వేషధారణతో విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకోవడం చూసిన తల్లితండ్రులు కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లీనికల్ సైకాలజిస్ట్ నవేధితకుమార్, గౌరవ అతిథిగా సాగర్‌రోడ్, ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివాజీ, బాచుపల్లి స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ మూర్తి, ఎర్లీ ఇయర్ కో-ఆర్డినేటర్ హరితరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

# కళాశాల అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరణ

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు నిపుణులైన అధ్యాపక బృందం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ చంద్రకళ చేతుల మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరుతూ బ్రోచర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ తులసి, తదితరులు ఉన్నారు.



అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, ప్రిన్సిపాల్ కాంచనలత, అధ్యాపకులు

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్**

షాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ఆకృతి ప్రాజెక్టులో భాగంగా రోబోటిక్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే తరాల్లో రోబోట్స్ చేసే పనుల గురించి విద్యార్థులకు వివరించారు. ఆరు పాఠశాలల విద్యార్థులు రోబోటిక్ ఫెస్ట్‌లో పాల్గొని, వారు తయారుచేసిన రోబోటిక్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఇందులో సర్దార్‌నగర్ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. మొయినాబాద్ మండలం బాకారం, పెద్ద మంగళారం పాఠశాల విద్యార్థులు రెండో బహుమతి గెలుచుకున్నారు. మూడో బహుమతి షాబాద్ పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆకృతి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనుయాదవ్, జిల్లా కో-ఆర్డినేటర్ అస్మసుల్తానా, ప్రాజెక్టు లీడ్స్ పవిత్ర, ఆమతుల్, మతీన్, భాస్కర్‌రెడ్డి, నరేందర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ భిక్షపతి, ప్రవళిక, కవిత, నవిత, నరేశ్, మేఘన, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ప్రాజెక్టు సిబ్బంది

### అభివృద్ధి రంగంలో సాంకేతికత కీలకం

**ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి**

మొయినాబాద్: అభివృద్ధి, పరిశోధన రంగాల్లో సాంకేతికత కీలకమని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజుల పాటు హ్యాక్‌స్మార్ట్-2025 పేరుతో నిర్వహించిన హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి 28 బృందాలు పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతను ప్రదర్శించాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ రాంబాబు ముదుసు, ఐజెన్ లాబ్స్ సీఈఓ ఆదర్శ్ కోదండ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

షాబాద్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సూపరింటెండెంట్ రాములు పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలు వివిధ నైపుణ్యాలను నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో తమ కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, తదితరులు ఉన్నారు.

### ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఊరేగింపు

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో గుంటుక శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులు, గ్రామస్తులు మంగళవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు పండితులు మంత్రోచ్ఛరణల మధ్య చక్ర స్నానం(చక్రతీర్థం)తో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ద్రోణాచారి, యాదగిరిచారి, రూప్లానాయక్, అంజయ్య, కృష్ణయ్య, కుమార్, వెంకటేశ్, యాదగిరి, అఖిల్, రాఘు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

**బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్**

మహేశ్వరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తామని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో సిరిగిరిపురం గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. గ్రామానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తడకల పోచయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుండె రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవ కొమురయ్య, గ్రామపెద్దలు బండ రాజేందర్, శ్రీను, సత్యనారాయణ చారి, పాండుచారి, గండికోట నర్సింహ, గండికోట బాబు, దాసయ్య, మహేశ్ పలువురు పాల్గొన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవర్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో మంగళవారం నిర్వహించిన సుదర్శన హోమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా స్వామివారికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఆగీరు రవికుమార్ గుప్తా తనసొంత ఖర్చులతో చేయించిన ఇత్తడి ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దైవ చింతన కలిగినవారు సాటివారి పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహులు, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**ఎమ్మెల్యే కాలె యాదయ్య**



మహిళలకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజం, వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎంఎన్‌సీ కంపెనీ ఫాక్స్ సహకారంతో మహిళలకు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్డీఓ చంద్రకళలతో కలిసి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాకు నియోజకవర్గంలోని మహిళల నుంచి విశేష స్పందన వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ జాబ్‌మేళాలో మొత్తం 122 మంది పాల్గొనగా.. వారికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 69 మంది ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన మహిళలకు వారు నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు బాగా చదువుకొని ఉన్నతస్థానాలకు చేరాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతోనే ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశామని, అడిగిన వెంటనే ఫాక్స్ కంపెనీ వారు ముందుకు వచ్చారన్నారు. ఇందులో ఎంపికైన మహిళలు ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని నలుగురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు బి.ఆగిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాలె శ్రీకాంత్, మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి, నాయకులు, ఐదు మండలాలకు చెందిన మహిళలు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386